క్లుప్తంగా

నేడు మండల సమావేశం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ వారి శాఖకు సంబంధించి అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2025–26 ఏడాదిలో 6, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఎంఈఓ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6,7,8,9,10,12వ తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

తొండూరు : తొండూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష వాయిదా పడిందని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వాయిదా పడిన పరీక్షను ఏప్రిల్ 13న నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9704550129, 9701171792, 9290798006 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణ పరిధిలోని జెండా మానమాన్ వీధిలో సోమవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ రంజాన్ తోఫా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా మాట్లాడుతూ ఐదేళ్లుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేద ముస్లిం కుటుంబాలు పండుగ రోజు సంతోషంగా జరుపుకోవాలని తమ వంతు సహాయంగా ప్రతి సంవత్సరం సుమారు వెయ్యి రూపాయల నిత్యవసరాల కిట్టు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం వరప్రసాద్‌ను సత్కరించి ఉప పండితులు మౌలానా అబ్దుల్ రెహమాన్‌తో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. వరప్రసాద్‌ను దేవుడు చల్లగా చూడాలని దీవెనలు ఇచ్చారు. రాష్ట్ర వైసీపీ నూర్‌బాషా సంఘం ఓ.రసూల్, పులివెందుల పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, కౌన్సిలర్ ఖాదర్, ముత్తవళీ షబ్బీర్, ప్రతాప్, అన్సర్, హమ్మద్, ముస్లింలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'గేట్'లో విద్యార్థిని ప్రతిభ

చింతకొమ్మదిన్నె : కడప- రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థిని పి.పావని గేట్–2025 పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా స్థాయిలో 439వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరరెడ్డి తెలిపారు.ఈ విద్యార్థినిని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్ప గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి, ఈడి అభిషేక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కే.శ్రీచందన, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

జమ్మలమడుగు రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు మండల పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 17వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో మంచి జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నారని, కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు కష్టమైన సబ్జెక్ట్‌లను ఇష్టంగా చదవాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సులు చేయడం వలన త్వరితగతిన ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కుంటలతో భూగర్భ జలాలు పెంపు

కమలాపురం: రైతులందరూ తమ పొలాల్లో కొంత విస్తీర్ణంలో ఉపాధి హామీ పథకం ద్వారా పంట కుంటలు తవ్వించుకోవాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని జి. అప్పాయపల్లెలో రైతు మల్లారెడ్డికి చెందిన చినీ చెట్ల పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పంట కుంటను డ్వామా పీడీ ఆది శేషారెడ్డితో కలసి ఎమ్మెల్యే పంట కుంటను తవ్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో ఒక వైపు కొంత విస్తీర్ణంలో పంట కుంటలను తవ్వుకోవాలని సూచించారు.

అపూర్వ స్వాగతం.. ఆత్మీయ పలకరింపు



లోపట్నూతలలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్



తాతిరెడ్డిపల్లెలో మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్

- లింగాల మండలంలో పర్యటించిన మాజీ సీఎం వైఎస్ జగన్
- ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు

లింగాల : లింగాల మండలంలో సోమవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, లోపట్నూతల గ్రామాల్లో ఆయన పర్యటించి శనివారం రాత్రి భారీ ఈదురు గాలులు, వడగండ్ల వానలకు తీవ్రంగా దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించి రైతులతో చర్చించారు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అదేవిధంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో చర్చించి పార్టీ ద్వారా నష్టపోయిన రైతులకు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. పులివెందుల నుంచి రోడ్డు మార్గం ద్వారా తాతిరెడ్డిపల్లెకు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మార్గ మధ్యలో ఇప్పట్ల, చిన్నకుడాల, లింగాల, కర్ణపాపాయపల్లె, లోపట్నూతల గ్రామాల్లోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆయనను కలిసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మండల కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ వ్యవసాయ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, పులివెందుల తాలుకా వైఎస్సార్‌సీపీ ఉద్యాన కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, తాతిరెడ్డిపల్లె శ్రీనివాసులరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, కోమన్నూతల మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వేమాపతి రెడ్డి, ఓంనాథరెడ్డి, నాగచంద్రారెడ్డి, మాజీ ఉపమండలాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రమేష్, జిల్లా ఉద్యాన శాఖాధికారిణి సుభాషిణి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది

పులివెందుల టౌన్ : క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని నగరిగుట్ట, బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యాశాలల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పులివెందుల ప్రాంత క్షయ వ్యాధి నివారణ విభాగం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సోమవారం పాత ప్రాంతీయ ఆసుపత్రి నుంచి పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మహాత్మా గాంధీ కూడలి వరకు చేరుకుని అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. టీబీఎంపీహెస్ నాగుల నాయక్, భాగ్యలక్ష్మి, నల్లపురెడ్డి పల్లి ప్రాథమిక వైద్యాశాల సూపర్ వైజర్లు సతీష్, కృష్ణవేణి, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సుమలత, సుబ్బారెడ్డి, బాదల్ వలి, ల్యాబ్ టెక్నీషియన్ రాధా రాణి, నాగేష్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు,తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకుంటే క్షయ వ్యాధిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని సీహెచ్‌సీ మెడికలాఫీసర్ శేఖర్ పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ క్షయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు పృథ్వీ కుమార్ రెడ్డి, వైద్యనాథ్, దీప, సీహెచ్ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నిసా, ఎంపీహెచ్ఇఓ ఫక్రుద్దీన్, హెల్త్ సూపర్ వైజర్ అరుణాదేవి, అంకయ్య, టీబీ సూపర్ వైజర్ సుకుమార్, సీహెచ్ఓలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని పట్టణ హెల్త్ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో వైద్య సిబ్బంది కలసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి, టీబీ సూపర్‌వైజర్ సునీల్, హెల్త్ సూపర్ వైజర్ ఓబులేసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

తొండూరు : మండలంలోని బూచుపల్లె గ్రామంలో సోమవారం క్షయ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా వైద్య సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్షయ వ్యాధి అంతం – మన పంతం, 2030 నాటికి క్షయ వ్యాధిని అంతం చేస్తామంటూ నినాదాలు చేశారు. సీహెచ్ఓ విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, పంచాయతీ కార్యదర్శి బాబు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

వేంపల్లె : ప్రతి రోజూ యోగా చేయడం వలన ఆరోగ్యంగా నిలకడగా ఉండడంతోపాటు పదిలంగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మోద్దీన్ తెలిపారు. సోమవారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి డీపీఎంయూ నాగ శశిభూషణ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మోద్దీన్ ఆధ్వర్యంలో యోగాపై డాక్టర్ గుమ్మల సాయి చందన శిక్షణ ఇచ్చారు. వైద్యులు పృథ్వీ కుమార్, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కిరణ్‌రెడ్డిని పరామర్శిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయితీలోని రామసుబ్బారెడ్డి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిరణ్‌రెడ్డిని సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే.పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కిరణ్‌రెడ్డికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, శివ, శ్రీనువాసులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని గోపులాపురం గ్రామంలో సోమవారం జరిగిన దేవర కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంపీటీసీ దొండపాటి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి ఏర్పాటు విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ నేతలు, కార్యకర్తల యోగక్షేమాలు తెలుసుకున్నారు.

'రాంగోపాల్ నీ స్థాయి తెలుసుకో'



హేమాద్రిరెడ్డి

పులివెందుల : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డిపై ఆరోపణలు చేసే అర్హత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు నంద్యాల హేమాద్రిరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలుపుతూ ఎస్వీ సతీష్ రెడ్డి 1999 నుంచి 2019 వరకు ఏ రోజు కూడా టీడీపీ టికెట్ కావాలని కోరలేదని, ఆ పార్టీ అధిష్టానం గుర్తించి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని తెలిపారు. రాంగోపాల్‌రెడ్డి స్థాయి తెలుసుకొని మాట్లాడాలని హెచ్చరించారు. సతీష్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించమని స్పష్టం చేశారు.

అరటి రైతులను ఆదుకుంటాం

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పర్యటించారు. శనివారం రాత్రి భారీ ఈదురు గాలులు, వర్షాలకు దెబ్బతిన్న అరటి, తమలపాకు తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో రైతులను ఫోన్ ద్వారా మాట్లాడించారు. మంత్రి అచ్చెన్నాయుడు రైతుల నష్టాలను అడిగి తెలుసుకున్నారు. రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.35వేలు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా చూస్తామన్నారు.

రైతులను ఆదుకోండి

లింగాల మండలంలో అకాల వర్షానికి పంటలు నష్టపోయిన అరటి రైతులను వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, ఆ పార్టీ లింగాల మండల అధ్యక్షుడు శంకర్ రెడ్డి తహసీల్దార్ ఈశ్వరయ్యను కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ ఈశ్వరయ్యను వారు కలిసి వినతి పత్రం అందించారు.

పిల్లల సంరక్షణలో తల్లి పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్‌బేగం

వేముల : పుట్టిన పిల్లల సంరక్షణలో తల్లి పాత్ర కీలకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా పేర్కొన్నారు. మండలంలోని వి.కొత్తపల్లె ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ–పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–3 సంవత్సరాల పిల్లల సమగ్ర అభివృద్ధి గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న బాలబాలికల విద్య వైద్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్‌బేగం అన్నారు. సోమవారం చిలంకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్ వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమారి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

వేంపల్లె : ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డీఆర్ఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకు అమ్ముకోవాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.20 కోట్లతో రైతు బజార్‌ను నిర్మించి ప్రారంభించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గత ఏడాది 18న రైతులతో కలసి ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. అందుకు స్పందించిన జిల్లా సంయుక్త అధికారి అదితి సింగ్ వెంటనే ప్రైవేటు స్థలంలో ఉన్న కూరగాయల మార్కెట్ తీసివేసి రైతు బజార్‌ను ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కొత్తపేట గంగమ్మ దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం ఈఓలు కృష్ణానాయక్, మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ ఆరు నెలల కాలానికి, జాతరకుకు సంబంధించి భక్తులు హుండీలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 8,15,239 నగదు వచ్చినట్లు తెలిపారు, అలాగే గంగమ్మ జాతర సందర్భంగా మూడు ఆదివారాలు టికెట్లు విక్రయించగా రూ. 3,19,747 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులతో పాటు సిబ్బంది, సేవకులు, ఇండియన్ బ్యాంకు సిబ్బంది, ఏఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు చేయండి

కొండాపురం: మండల పరిధిలోని వెంకయ్యకాలువ, కె. రామిరెడ్డిపల్లె, బి. కొట్టాలపల్లె గ్రామాల్లో బోరింగులు (చేతిపంపులు) చెడిపోవడంతో మరమత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వేసవి కాలంలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాలల్లో బోరింగు సామగ్రి లేకపోవడంతో మరమ్మతులు చేయడం లేదని, దీంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై ఎంపీడీఓ నాగప్రసాద్‌ను వివరణ కోరగా గ్రామాల్లో ఎక్కడెక్కడ బోరింగులు పని చేయ లేదో వాటిని జాబితా తయారు మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

భక్తిపారవశ్యం.. జ్యోతుల మహోత్సవం



జ్యోతులతో నృత్యం చేస్తున్న భక్తులు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరీదేవి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు దారి పొడవునా నీల్లు చల్లుతూ అమ్మవారిని స్వాగతం పలికారు. అందంగా అలంకరించబడిన జ్యోతులను తలలపై పెట్టుకున్న భక్తులు అమ్మవారి పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ గ్రామోత్సవం వెంట సాగారు. కొందరు భక్తులు జ్యోతులను తలపై పెట్టుకుని చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామదేవత ఎదుట ఉదయం జ్యోతులను ఆర్పే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఖడ్గ పద్యాలతో, కత్తి సాములతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

గంగమ్మా.. కరుణించమ్మా..!

వల్లూరు (చెన్నూరు) : కరుణించవమ్మ గంగమ్మా అంటూ చెన్నూరు ఇలవేల్పు కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లికి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు చల్ల, రెండవరోజు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకుని పాలికేకలతో అమ్మవారికి జంతుబలి అర్పించారు. జాతర సందర్భంగా గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోపుర నమూనా అమ్మవారి అలంకరణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. గంగమ్మ తల్లి దీవెనలు కొరకు వేలాది మంది భక్తులు కాయ కర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు.

పటిష్ట భద్రత

గంగమ్మ జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్న డీఈఓ

తల్లిదండ్రుల ఆవేదన

వేంపల్లె : పదో తరగతి పరీక్షలు రాస్తున్న సమయంలో డీఈఓ సంషుద్దీన్ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సోమవారం ఆయన వేంపల్లి జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులు మ్యాథమెటిక్స్ పరీక్ష రాస్తుండగా పరీక్ష హాల్లోకి వచ్చి విద్యార్థులను పైకి లేపి పేర్లు అడుగుతూ మాస్ కాపీయింగ్ కొడుతున్నారని బెదిరించారని తెలిపారు. కాపీలు రాస్తున్నారని అందరి ముందు లేపి అడగడంతో విద్యార్థులు మనస్థాపానికి గురయ్యారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష రాసే సమయంలో ఒకవైపు సిట్టింగ్ స్క్వాడ్, డీఈఓలు విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో వచ్చిన ప్రశ్నలకు కూడా సమాధానం రాయలేకపోయామని విద్యార్థులు వాపోయారు. దీంతో డీఈఓ సిట్టింగ్ స్క్వాడ్‌లపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీఈఓను వివరణ కోరగా.. వేంపల్లెలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మాస్ కాపీంగ్ జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అందుకు సంబంధించి వీడియోలు కూడా పంపిస్తామని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేశామని తెలిపారు.

ప్లేస్ మెంట్ ఇంటర్వ్యూల్లో 25 మందికి ఉద్యోగాలు



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, అధికారులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఐటీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి వినోద్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ శ్రీనివాస్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఐటీ సంస్థ ప్లేస్ మెంట్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 34 మంది విద్యార్థులు హాజరు కాగా.. 25మంది కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారన్నారు. ఇందులో 22 మంది విద్యార్థులు సి రూల్ విభాగానికి ఎంపిక కాగా, మిగిలిన ముగ్గురు నెక్స్ రూల్ విభాగానికి సెలెక్ట్ ఎంపికయ్యారు. ఏసీ రూల్ విభాగానికి ఎంపికైన విద్యార్థులకు 4.5 ఎల్‌పీఏ, నెక్స్ రూల్ విభాగానికి విద్యార్థులకు ఏడాదికి 5ఎల్‌పీఏ నుంచి 7ఎల్‌పీఏ వరకు జీతం వస్తుందన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులకు సోమవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, రమేష్ కైలాస్ అభినందించారు.

28న పంచాయతీ వేలం పాట

ముద్దనూరు: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయానికి ఈ నెల 28వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ లక్ష్మీనరసింహులు సోమవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బస్టాండు, జంతువధశాలకు వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు బస్టాండు నిర్వహణకు రూ.4లక్షలు ధరావతు, జంతువధశాలకు రూ.40వేలు ధరావతు చెల్లించాలని, ఈ పాటలో పాల్గొనేవారు పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని చెప్పారు. మరిన్ని వివరాలకు ముద్దనూరు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

26న వేలం పాట

చింతకొమ్మదిన్నె : కొలుములపల్లె గ్రామ పరిధిలోని గుట్టరాళ్ల టోల్ గేట్ వసూలుకు వేలంపాటను మార్చి నెల 26న ఉదయం 10.30 గంటలకు కొలుములపల్లె పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. టోల్ గేట్ వేలంపాటలో పాల్గొనేవారు 26వతేది ఉదయం 10.30 గంటలకు కొలుములపల్లె గ్రామ పంచాయతీ పేరిట స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రూ. 50వేలు డీడీ రూపంలో గానీ, నగదుగా గానీ చెల్లించాలన్నారు.

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారాంతపు సంత మార్కెట్‌కు ఈనెల 28వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకట్రాముడు తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ వేలం పాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదన్నారు. చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్మును పంచాయతీ కార్యదర్శి సింహాద్రిపురం గ్రామ పంచాయతీ పేరు మీద బ్యాంకు డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలన్నారు

సాంకేతిక విద్య.. భవితకు భరోసా

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఓ చక్కని వేదిక. ఈ కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పది తర్వాత పాలిటెక్నిక్‌విద్య వైపు మళ్లితే తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాలు అందుకుని మూడు, నాలుగేళ్లలోపు బంగారు భవితను సొంతం చేసుకోవచ్చని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

- పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఏప్రిల్ 30న పాలిసెట్



సింహాద్రిపురంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల

సింహాద్రిపురం : ఉన్నత చదువులు రోజురోజుకు భారమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో పేద విద్యార్థులు సాంకేతిక విద్య వైపు అడుగులు వేస్తే భవిష్యత్ బంగారు బాట అవుతుంది. పాలిటెక్నిక్ ప్రవేశం ద్వారా తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య పూర్తి చేసి ఆ తర్వాత దాని పునాదిగా చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోవచ్చునని పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2425 నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ముందుగానే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకుని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి ఉన్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. అటువంటి వారికి పాలిటెక్నిక్ కోర్సులు చక్కని వేదికలు అని పలువురు సాంకేతిక విషయ నిపుణులు పేర్కొంటున్నారు. పాలిసెట్ కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తుల తుది గడువు ఏప్రిల్ 15 వరకు ఉంది.


కోర్సులు ఇలా..

ప్రస్తుతం సరికొత్త కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులోకి తెచ్చాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటో ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 30 సీట్లు ఉన్నాయి. సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ ఒక్కొక్క బ్రాంచ్‌కు 30 సీట్ల ప్రకారం ఐదు బ్రాంచ్‌లలో 150 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇందులో భాగంగా ఆరునెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ కూడా ఇస్తారు. ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నారు.

పాలిసెట్ ఎంట్రెన్స్ ఇలా..

పాలిసెట్ ఎంట్రెన్స్‌కు 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం 50. ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఎగ్జామ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400గా నిర్ణయించారు.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చదువుకునేందుకు పాలిసెట్–2025 దరఖాస్తు చేసుకోవాలి. పాలిటెక్నిక్ చదివితే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుంది. చక్కటి హాస్టల్ వసతితోపాటు చక్కటి విద్యా బోధన చేసే లెక్చరర్లు ఉన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్, సంబంధిత మెటీరియల్ ఉచితంగా సరఫరా చేస్తున్నాం.

–తాతాజీ, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్, సింహాద్రిపురం